క్లుప్తంగా

అసిరితల్లికి పూజలు



ఘటాలతో వెళ్తున్న భక్తులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల గ్రామంలో అసిరితల్లి అమ్మవారి పండుగలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ఈ నెల 31వ తేదీ వరకు అమ్మవారికి పూజా కార్యక్రమాలు ఉంటాయి. ఆదివారం భక్తులు ఘటాలతో వెళ్లి ముర్రాటలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

విద్యార్థి దశ నుంచే ఆధ్యాత్మికత



మాట్లాడుతున్న గణేష్ గురూజీ

శ్రీకాకుళం కల్చరల్: విద్యార్థి దశ నుంచే ఆధ్యాత్మికత అవసరమని గణేష్ గురూజీ అన్నారు. బలగ నాగావళి తీరంలో ఉన్న బాల త్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలోని బాల సంస్కార కేంద్రంలో నెల రోజులుగా జరుగుతున్న వేసవి శిక్షణా తరగతులలో భాగంగా ఆదివారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 మంది పిల్లలకు నిత్య పూజావిధానం వేదాలు, భగవద్గీత పారాయణ నేర్పించామని చెప్పారు. అనంతరం తల్లిదండ్రులకు పాదపూజ నిర్వహించారు. వేద పారాయణ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి శ్రీరంగం మధుసూదనరావు, జగన్ గురూజీ, విష్ణు, ఆర్కే లక్ష్మీ పాల్గొన్నారు.

మంచినీటి సమస్య పరిష్కరించాలి



ఖాళీ బిందెలతో నిరసన తెలియజేస్తున్న ప్రజలు

ఎచ్చెర్ల క్యాంపస్: మంచినీటి సమస్యను పరిష్కరించాలని డి.మత్స్యలేశం గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఖాళీ బిందెలతో స్థానిక వైశాఖి హేచరీస్ పరిశ్రమ ఎదుట ఆదివారం నిరసన తెలియజేశారు. పరిశ్రమ వల్ల భూగర్భ జలాలు కలుషిత మయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్వో ప్లాంట్ల ద్వారా పంచాయతీకి మంచినీటిని పరిశ్రమ యాజమాన్యం సరఫరా చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

బ్యాడ్మింటన్ పోటీలకు అంపైర్‌గా శరత్‌బాబు



తుంగాన శరత్‌బాబు

కవిటి: జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కవిటి పట్టణానికి చెందిన తుంగాన శరత్‌బాబు ఖేలో ఇండియా షటిల్ బ్యాడ్మింటన్ జాతీయ స్థాయి పోటీలకు అంపైర్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదివారం కవిటిలో జిల్లా బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది తమరాల జయరాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29 నుంచి వచ్చే నెల 3 వరకు ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో జరగనున్న జాతీయస్థాయి ఖేలో ఇండియా పోటీలకు శరత్‌బాబు ఎంపిక కావడానికి కృషి చేసిన రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్‌కు, జిల్లా సంఘానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆత్మజ్ఞానమే ముక్తికి మార్గం



వక్తను సత్కరిస్తున్న సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: ఆత్మజ్ఞానమే ముక్తికి మార్గమని వక్త రంగడు ప్రసాదరావు అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో ఆదిశంకరాచార్యులు రచించిన వివేక చూడామణిలోని పలు అంశాలపై ఆదివారం ప్రసంగించారు. నిరాకారం, నిస్సంగమైన ఆత్మలో కూడా వస్తుమయ ప్రపంచం లేదని వివరించారు. కార్యక్రమంలో మందుల మోహనరావు, పతంజలిశాస్త్రి, కె.వి.ఎస్.స్వామి, ఈశ్వరరావు, తవుడు, విశ్వేశ్వరరావు, అప్పారావు, నరసునాయుడు, బాబారావు, ఎన్.నరసింహమూర్తి, సరస్వతి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సిటిజన్ ఔట్‌రీచ్ సర్వే



వాల్తేపేటలో సర్వే చేస్తున్న వలంటీర్లు

లావేరు: మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం ఇంటింటా సిటిజన్ ఔట్ రీచ్ సర్వే జరిగింది. ఇందులో భాగంగా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి మీ సచివాలయం ఎక్కడ ఉంది, మీ వలంటీరు ఎవరో తెలుసా, ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

విజ్ఞాన శిబిరాలతో సృజనాత్మకత



శ్రీకాకుళం అర్బన్: పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

శ్రీకాకుళం అర్బన్: వేసవి విజ్ఞాన శిబిరాలతో సృజనాత్మకత పెరుగుతుందని జిల్లా గ్రంథాలయ అధికారి ఎస్.వి.రమణమూర్తి అన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులకు ఆదివారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి వేసవి విజ్ఞాన శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. అనంతరం ప్రభుత్వ ఉపాధ్యాయురాలు టి.ఎర్రమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులకు జీకే పోటీ నిర్వహించారు. కార్యక్రమంలో పి.భానుమతి, పి.రామ్మోహన్, పి.ఈశ్వరరావు, గణేష్ పాల్గొన్నారు.



ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



లావేరు: కథల పోటీల్లో చిన్నారులు

- శ్రీకాకుళం అర్బన్: బలగ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలోభాగంగా చిన్నారులతో కథలు, పుస్తక పఠనం చేయించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేన, సహాయకురాలు పి.అనిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు క్విజ్ పోటీలులు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. పోటీలను గ్రంథాలయ అధికారి నీలమ్మ, ఎం.లక్ష్మీనారాయణ, పాపారావు పర్యవేక్షించారు.

- లావేరు: మురపాకలోని శాఖాగ్రంథాలయంలో విద్యార్థులకు కథల పుస్తకాలు చదవడంపై పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పర్యవేక్షించారు. విద్యార్థులు పాఠ్య పుస్తకాలతో పాటు కథల పుస్తకాలు కూడా చదవాలన్నారు. గ్రంథాలయ సహాయకుడు పి.షణ్ముఖరావు పాల్గొన్నారు.
- రణస్థలం: విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటల్లోను రాణించాలని రణస్థలం శాఖా గ్రంథాలయాధికారిణి పి.వరలక్ష్మి అన్నారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఐ.సతీష్, కె.భాస్కరరావు ఉన్నారు.



రణస్థలం: ఆటలాడుతున్న పిల్లలు

మహిళా సమస్యలపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్

శ్రీకాకుళం కల్చరల్: జేసీఐ శ్రీకాకుళం గ్రీన్‌సిటీ ఆధ్వర్యంలో ప్రయాస్ ప్రోగ్రాంలో భాగంగా మంగువారితోట సచివాలయంలో ఆదివారం మహిళల సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లైఫ్ ఆసుపత్రి వైద్యులు సనపల చంద్రశేఖర్ మహిళల శారీరక సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో గ్రీన్‌సిటీ అధ్యక్షులు మణిశర్మ, సెనేటర్ మధుబాబు, ఐపీపీ సాయిబాబా, వైస్ ప్రెసిడెంట్ జి.మల్లేశ్వరరావు, జాడ సాయి, జి.వనిత, రాము, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

లావేరు: కేశవరాయునిపాలెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు సోమవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సరఫరా నిలిపి వేస్తున్నట్టు ఈఈ ఎస్.బయ్యన్ననాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.పెదరావుపల్లి 11 కేజీ విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపడుతున్నందున సరఫరాను నిలిపి వేస్తున్నట్టు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

‘పేదలను పట్టించుకోని చంద్రబాబు’

జి.సిగడాం: ముఖ్యమంత్రిగా 14 ఏళ్లు పని చేసిన చంద్రబాబు అప్పట్లో పేదలను పట్టించుకోలేదని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ అన్నారు. ఆనందపురం గ్రామంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో ప్రజలను మోసం చేయడానికి మరోసారి ప్రయత్నిస్తున్నారని అప్రమత్తంగా ఉండాలన్నారు. రాజమండ్రిలో టీడీపీ నిర్వహించింది మహానాడు కాదు మాయలనాడు అని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వడంతోపాటు ఇళ్లను నిర్మించి ఇస్తుండగా.. వాటిని కూడా సమాధిలతో చంద్రబాబు పోల్చడం అతని అహంకారానికి నిదర్శనమన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు ప్రజలు సమాధి కట్టడం ఖాయమన్నారు. మండల వైఎస్సార్‌సీపీ నాయకులు చిత్తిరి మోహన్, కర్రి వైకుంఠేశ్వరరావు ఉన్నారు.

కళాకారులను ప్రోత్సహించాలి

సోంపేట: కళలను కాపాడుతున్న కళాకారులను ప్రోత్సహించాలని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ అన్నారు. బెంకిలి గ్రామంలోని ఉమామహేశ్వర ఆలయం ఆవరణలో మండల కళాభారతి సంక్షేమ సమాఖ్య ద్వితీయ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని కళాకారులచే ఏర్పాటు చేసిన కచేరి శ్రోతలను మంత్రముగ్ధులను చేసింది. అనంతరం కళాకారులను సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు సింహాచలం పాడి, ఎర్రగాంధీ, నిమ్మన పార్వతీశం, దేవేంద్రనాథ్ పండా, తామాడ చంద్రశేఖర్, సాహుకారి జానీ, శివాజీ పాణిగ్రాహి, జిణగ కృష్ణ పాల్గొన్నారు.

బాలల వికాసానికి తోడ్పాటు అందించాలి



నృత్యం చేస్తున్న బాలికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: బాలల వికాసానికి చొరవ తీసుకుని, వారిలో దాగి ఉన్న నైపుణ్యాన్ని గుర్తించేందుకు తల్లిదండ్రులు, గురువులు చొరవతీసుకోవాలని క్రియేటివ్ చిల్డ్రన్స్ క్లబ్ కన్వీనర్ చింతాడ కృష్ణారావు మాస్టారు కోరారు. శ్రీకాకుళం నగరంలోని యూటీఎఫ్ భవన్ వేదికగా ఈ నెల 23 నుంచి క్రియేటివ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వేసవి వినోదం పేరిట 4 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న బాలబాలికలకు సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. మూడేళ్లగా బాలలు, విద్యార్థులకు ఉచితంగా తరగతులు నిర్వహిస్తూ, వివిధ అంశాల్లో ప్రోత్సహిస్తూ, స్నేహపూరిత వాతావరణంలో అనేక అంశాలను నేర్చుకునే అవకాశం ఈ క్యాంపు ద్వారా కల్పిస్తున్నారు. ఆదివారం నృత్యాల ప్రదర్శన, పాటలు, కవితలు, క్విజ్, పిల్లల ఆలోచనలకు, ఊహాశక్తికి రూపం తెచ్చే కథలు, కవితలు, వార్తలు చదవడం వంటి అంశాలలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

టెక్కలి: ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఆశా వర్కర్ యూనియన్ రాష్ట్ర నాయకురాలు కె.నాగమణి డిమాండ్ చేశారు. ఆదివారం టెక్కలిలో నియోజవకర్గ స్థాయిలో ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ఎటువంటి వేధింపులు లేకుండా, ప్రభుత్వ పథకాలు వర్తించేలా చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు ధనలక్ష్మి, ఎస్.షణ్ముఖరావు, విజయ, కుంతి, సుజాత, అన్నపూర్ణ, ఉమా, ఈశ్వర్రావు పాల్గొన్నారు.

సమైక్యతకు ప్రతిరూపాలు క్రీడలు



బ్యాటింగ్ చేస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు
- రట్టిలో ముగిసిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు

మందస: క్రీడలు సమైక్యతకు ప్రతిరూపాలని రాష్ట్ర పశు సంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన భేతాళపురం పంచాయతీ రట్టిలో నెల రోజులుగా జరుగుతున్న జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ క్రీడలు స్నేహపూరిత వాతావరణంలో జరగాలన్నారు. రట్టి గ్రామం అందరికీ ఆదర్శమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న క్రీడా పోటీలు మైత్రికి వారధుల్లా పని చేస్తాయన్నారు. యువత అంకితభావం, పోటీతత్వంతో పని చేయాలన్నారు. ఉద్దాన పరిస్థితుల్లో మార్పు వచ్చిందని, ఆదర్శగ్రామాలుగా తీర్చిదిద్దుతున్నారని చెపఆపరు. రట్టి గ్రామ యువకులు ఎవరిపై ఆధారపడకుండా రెండేళ్లు కష్టపడి.. ఏకంగా క్రీడా మైదానాన్ని నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. దేహ దారుఢ్యానికి, ఆరోగ్యానికి క్రీడలు తప్పనిసరని, ఆర్మీ, పోలీసు వంటి ఉద్యోగాలకు కూడా దోహదపడతాయని చెప్పారు. అంతకుముందు మంత్రి కాసేపు బ్యాటింగ్ చేశారు. ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన రంగనాథపురం, ఎగువూరు జట్లకు ట్రోఫీ, నగదు, బహుమతులను అందజేశారు. వివేకానంద యువజనసేవా సంఘం, గ్రామపెద్దలు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ డొక్కరి దానయ్య, సర్పంచ్ మామిడి సింహాద్రి, ఎంపీటీసీలు సూరాడ వాసు, తెప్పల ఉమాపతి, డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన యూనివర్సిటీ బోర్డు మెంబరు బత్తిని లక్ష్మణ్, గ్రామ పెద్ద కంసు కృష్ణమూర్తి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన కార్యదర్శి రాపాక శేషగిరిరావు, జాయింట్ కార్యదర్శి పులారి కూర్మారావు, రాంపురం సర్పంచ్ పొట్టి ధర్మారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పులారి పీతాంబరం, పులారి తవిటయ్య, కొల్లి మోహనరావు, మామిడి భగీరథి, సారదూర్వాసులు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి చేతుల మీదుగా ట్రోఫీ అందుకుంటున్న క్రీడాకారులు

కోదండ సీతారామ ఆలయ ప్రతిష్ట



కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: పాతర్లపల్లి గ్రామంలో కోదండ సీతారామ ఆలయ ప్రతిష్ట మహోత్సవాలను ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అదివారం ప్రారంభించారు. 31వ తేదీ వరకు పలు పూజా కార్యక్రమాలు జరుగాయని నిర్వాహకులు తెలిపారు. గ్రామ సర్పంచ్ గొర్లె రాధాకృష్ణ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, పాతర్లపల్లి గ్రామ పంచాయతీ పెద్దలు మహంతయ్య, లోలుగ క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు బైక్ ర్యాలీలు

రణస్థలం: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ, అభివృద్ధి పాలన దిగ్విజయంగా నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో రణస్థలం మండలంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు మండల జేసీఎస్ కన్వీనర్ చిల్ల వెంకటరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉనయం తొమ్మిది గంటలకు రణస్థలం మండల కేంద్రంలోని రామతీర్థాలు కూడలి నుంచి కోష్ట, పాతర్లపల్లి, భద్రమహంకాళీ అమ్మవారి అలయం, నీలంపేట, యర్రవరం, రావాడ మీదుగా జె.ఆర్.పురం పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ సాగుతోందన్నారు.

జి.సిగడాంలో..

జి.సిగడాం: మండల కేంద్రం నుంచి సోమవారం నిర్వహించే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని ఎంపీపీ మీసాల సత్యవతి, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు వెంకటరమణ కోరారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ ఆదేశాల మేరకు ఉదయం తొల్లి గంటలకు ర్యాలీ ప్రారంభిస్తామన్నారు.

అపూర్వ కలయిక



ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

జి.సిగడాం: జి.సిగడాం జిల్లా పరిషత్ పాఠశాలలో 1997–98 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. దీనికి చదువుకున్న పాఠశాలే వేదికైంది. చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. కుటుంబ నేపథ్యం, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గ్రూపుఫొటోలు తీసుకొని సందడి చేశారు. ఈ సందర్భంగా చదువు నేర్పిన గురువులు చిత్తిరి అప్పలనాయుడు (సీఏ నాయుడు) భూపతి వెంకటరావు, జడ్డు శ్రీరామమూర్తి, జగదాంబలతోపాటు మరో ఐదుగురిని సత్కరించి గౌరవించారు.

రెండున్నర దశాబ్దాల తరువాత.. ఒకే వేదికపై..

లావేరు: మురపాక హైస్కూల్‌లో 1996–97 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు, అప్పటి గురువులంతా ఒకచోట కలుసుకొని ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం చేయాలని నిర్ణయించుకున్నారు. ఫోన్, వాట్సాప్ ద్వారా సమాచారం చేరవేశారు. దీంతో పలు ప్రాంతాల్లో స్థిరపడినవారంతా కుటుంబాలతో సహా ఆదివారం మురపాక హైస్కూల్‌కు వచ్చారు. 26 ఏళ్ల తరువాత అప్పటి గురువులు, చదువుకున్న వారంతా కలియడంతో అప్యాయంగా పలకరించుకున్నారు. అప్పటి తీపిజ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఎవరు ఏమి చేస్తున్నారు, ఎలా ఉన్నారు, కుటుంబ యోగక్షేమాలు, పిల్లలు గురించి అడిగి తెలుసుకున్నారు. రెండున్నర దశాబ్దాల తరువాత పూర్వపు గురువులు, విద్యార్థులంతా కలుసుకొని ఆనందంలో మునిగితేలారు. అప్పటి హెచ్‌ఎం, ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు దుశ్శాలువలతో సత్కరించి గౌరవించారు. కార్యక్రమంలో హైస్కూల్ అప్పటి హెచ్‌ఎం కె.బస్వరాజు, ప్రస్తుత హెచ్‌ఎం ఎం.అరుణ పాల్గొన్నారు.



లావేరు: మురపాక హైస్కూల్‌లో కలుసుకున్న 1996-97 బ్యాచ్ పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

నాయీబ్రాహ్మణులు సంఘటితం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఆర్.అరవింద్

టెక్కలి: జిల్లాలో నాయీబ్రాహ్మణులంతా సమస్యలను పరిష్కరించుకునే విధంగా సంఘటితం కావాలని ప్రముఖ వైద్యుడు ఆర్.అరవింద్ కోరారు. టెక్కలి డివిజన్ పరిధిలోని నాయీబ్రాహ్మణులతో ఆదివారం పట్టణంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నాయీబ్రాహ్మణులు అణచివేతకు గురయ్యారని, ప్రస్తుత ప్రభుత్వం చిత్తశుద్ధిగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఇటువంటి తరుణంలో మరి కొన్ని శాశ్వతమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించుకునేలా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి మండల కేంద్రంలో సామాజిక భవనాలు, గ్రామీణ ప్రాంతాల్లో నాయీబ్రాహ్మణుల వృత్తికి అవసరమైన షెడ్లు, జిల్లాలో సంగీత కళాశాల తదితర సమస్యలను ప్రభుత్వానికి నివేదించాలన్నారు. దీనిలో భాగంగా జూన్ 27న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న నాయీబ్రాహ్మణ చైతన్య వేదిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం జిల్లా, డివిజన్ నాయకులు కె.గజపతిరావు, ఆర్.కృష్ణారావు, వెంటేశ్వర్లు, టి.కర్రెన్న, శంకరరావు, సీహెచ్.జగదీష్, పాపారావు, రమణమూర్తి, అమ్మోజీరావు, రామారావు, వెంకటరావు, ధర్మారావు, కృష్ణారావు, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి సాయం

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని చినవంక గ్రామానికి చెందిన కంసు భువనేశ్వరి కుటుంబానికి ఇల్లు లేకపోవడంతో మైటీ సంస్థ ప్రతినిధులు ఆదివారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. భువనేశ్వరి తుఫాను భవనంలో తలదాచుకోవడంతో రేకులషెడ్ నిర్మించి ఇచ్చినట్లు సంస్థ అధ్యక్షుడు కోటిపల్లి రాజేష్ తెలిపారు.

మృత్యుంజయ ఫౌండేషన్ సాయం

ఇచ్ఛాపురం రూరల్: లొద్దపుట్టి గ్రామానికి చెందిన కొంతాల కేశవరావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. పేద కుటుంబం కావడంతో సవరదేవిపేటకు చెందిన మృత్యుంజయ ఫౌండేషన్ సభ్యులు ఆదివారం బాధితుడి నివాసానికి వెళ్లి రూ.7వేలు అందజేశారు.